క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సమయపాలన తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంఈఓ ఆర్ శ్రీనివాసరావు

వీసీపల్లి: బదిలీపై మండలానికి వచ్చిన ఉపాధ్యాయులంతా సమయపాలన పాటించి ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉందని ఎంఈఓ ఆర్ శ్రీనివాసరావు, సంజీవ్ అన్నారు. స్థానిక ఎమ్మార్సీలో గురువారం ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై కోటయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా ఉన్నతమైందని, తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులకే ఉందన్నారు.

ఆలయం పరిశీలన



ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఈఓ, కమిటీ సభ్యులు

హనుమంతునిపాడు: మండలంలోని చిన్న గొల్లపల్లి నాగులేటి ఒడ్డున వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థాన పునర్నిర్మాణ పనులను ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీగిరిరాజు నరసింహబాబు, కమిటీ సభ్యులు ఎస్ జగన్మోహన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేస్తున్నామన్నారు. ఆలయ పునఃనిర్మాణ కమిటీ చైర్మన్ ఎస్ . జగన్‌మోహన్‌రెడ్డి, ఎస్ కాశిరెడ్డి, మాలపాటి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



భైరవకోనలో యోగాసనాలు వేస్తున్న ఈఓ, అర్చకులు, సిబ్బంది, విద్యార్థులు

సీఎస్‌పురం(పామూరు): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని భైరవకోన ఆలయాల ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం భైరవకోనలో గురువారం ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా నిర్వహించారు. యోగా ఇన్‌స్ట్రక్టర్ చంద్ర అర్చకులు, ఆలయ సిబ్బంది, విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. ఈసందర్భంగా ఈఓ, ఇన్‌స్ట్రక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం గంట పాటైనా యోగాసనాలకు కేటాయించాలని, తద్వారా మెరుగైన ఆరోగ్యం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపొందుతుందన్నారు.

సెల్‌టవర్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న ఆర్డీఓ, డీటీ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని బోయమడుగుల గ్రామ పంచాయతీ పరిధిలోని బాలుపల్లెకు 2024లో బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ మంజూరైంది. ఈసందర్భంగా గురువారం సెల్‌టవర్ ఏర్పాటుకు తహసీల్దార్, గ్రామస్తులు ప్రతిపాదించిన స్థలాన్ని ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి సిబ్బందితో కలిసి పరిశీలించారు. స్థల మంజూరుకు అన్ని చర్యలు చేపట్టాలని డిప్యూటీ తహసీల్దార్ పొన్నరుసు వెంకటేశ్వర్లుకు సూచించారు. ఎంపీటీసీ బైరెడ్డి తిరుపతిరెడ్డి, సర్పంచ్ బొట్లా చిరంజీవి, వీఆర్ఓ మాలకొండయ్య పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన



ఫ్లోరోసిస్ బాధితులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారులు

కనిగిరిరూరల్: ఫ్లోరోసిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ వి.అనీల్‌కుమార్ అన్నారు. మండలంలోని మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని భూతంవారిపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో గురువారం ఫ్లోరోసిస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డాక్టర్ దాదా షరీఫ్‌తో కలిసి ఫ్లోరోసిస్ బాధితులకు ఇచ్చిన పరికరాలు ఎలా పనిచేస్తున్నాయని, వాటిని ఎలా వినియోగిస్తున్నారనే వివరాలు పరిశీలించారు. వైద్యాధికారి డాక్టర్ దాదా షరీఫ్, ల్యాబ్ టెక్నీషియన్ అనూషా, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ దంతులూరి ప్రకాశం, వేదికపై జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, అధికారులు



ఏఓను ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి

- అధికారుల తీరుపై ధ్వజమెత్తిన సభ్యులు
- అన్నదాత సుఖీభవ పథకం తీరుపై ప్రశ్నలవర్షం

కనిగిరిరూరల్:

కనిగిరి మండల సర్వసభ్య సమావేశం గురువారం వాడీవేడీగా సాగింది. సభ్యులు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. ప్రభుత్వ పథకాల అమలులోని లోపాల తీరుపై సూటిగా ప్రశ్నలు సంధించారు. దీంతో వివిధ శాఖల అధికారులు సభ్యులకు జవాబు చెప్పలేక తడబడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఎంపీపీ దంతులూరి ప్రకాశం అధ్యక్షతన కనిగిరి మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పనులు కల్పిస్తున్నామని, కూలి నగదు చెల్లిస్తున్నామని చెప్పగా..సభ్యులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. పేరంగుడిపల్లి, పునుగోడు ఎంపీటీసీ, పోలవరం, గుడిపాడు, లింగారెడ్డిపల్లి సర్పంచ్‌లు అధికారి మాటలపై తీవ్రంగా మండిపడ్డారు. మూడు నెలలుగా కూలీలకు కూలి అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో చాలా గ్రామాల్లో పనులకు వెళ్లడం మానేశారని ధ్వజమెత్తారు. దీనికి ఏపీఓ సమాధానమిస్తూ త్వరలో కూలి నగదు జమవుతుందని చెప్పి జారుకున్నారు. ఏఓ ఎస్‌కే జైనులాబ్దిన్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కింద కనిగిరి మండలంలో 7,800 మంది రైతు కుటుంబాలు ఎంపికైనట్లు చెప్పారు. తొలివిడతగా సెటిల్‌మెంట్ భూములు కల్గిన రైతులవే అర్హుల జాబితాలో వచ్చాయని, అసైన్డ్ భూముల రైతుల గూర్చి పరిశీలన జరుగుతుందని త్వరలో వచ్చే అవకాశం ఉందని చెప్పారు. దీంతో వైస్ ఎంపీపీ లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే రహీంలు మాట్లాడుతూ సెటిల్‌మెంట్ భూములు కల్గిన వారే రైతులా.. మిగతా రైతులు వ్యవసాయం చేయడం లేదా.. అసైన్డ్ భూములు కల్గిన వారు రైతులుగా లెక్కలోకి రారా..? రాష్ట్రంలో అత్యధికంగా అసైన్డ్ భూముల రైతులే ఉన్నారు. ప్రభుత్వానికి, అధికారులకు తెలియదా.. ? మా పునుగోడు ప్రాదేశికంలో గత ప్రభుత్వంలో రైతు భరోసా కింద 1,000 మందిని అర్హులుగా ఎంపిక య్యారని, ఈ ప్రభుత్వంలో అన్నదాత సుఖీభవ పథకం కింద కేవలం 400 మందినే అర్హుల జాబితాలతో చేర్చాలని మండిపడ్డారు. తాళ్లూరు పంచాయతీలో గత ప్రభుత్వంలో రైతు భరోసాకు 450 మంది ఎంపికైతే.. ఇప్పుడు 220 మంది మాత్రమే అన్నదాత సుఖీభవ అర్హత జాబితాలో ఉన్నారని, ఇదేంటని ప్రశ్నించారు. ఏఓ సమాధానమిస్తూ రైతులంగా విధిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. త్వరలో మార్క్‌ఫెడ్ ద్వారా కందుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వంగపాడు, ఎగువపల్లి, కృష్ణాపురం, లద్దిమల్లపురం, జమ్ములమడక, ఎల్లంవారిపల్లి కరెంట్ హెల్పర్ లేక పోవడంతో తీవ్ర ఇక్కటు పడుతున్నామని, రాత్రిళ్లు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగి అంధకారంలో ఉండాల్సి వస్తోందని సర్పంచ్‌లు పాశం కొండయ్య, సిద్ధారెడ్డి, రావులపల్లి తిరుపతయ్య, నరాల వెంకటరెడ్డి విద్యుత్ ఏఈలపై ధ్వజమెత్తారు. అలాగే గుడిపాడు రూట్‌లో కూడా విద్యుత్ అధికారులు లేక ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్‌లు దామిరెడ్డి నాగేంద్రారెడ్డి ప్రశ్నించారు. విద్యుత్ సిబ్బంది కొరత వల్ల సమస్య ఉందని త్వరలో సమస్యను పరిష్కరిస్తామని రూరల్ ఏఈ తెలిపారు. పొలంవరం కాలనీల్లో మీటర్లు బిగించి విద్యుత్ సప్లయ్ ఎందుకు ఇవ్వలేదని సర్పంచ్ మునగల బ్రహ్మారెడ్డి ప్రశ్నించారు. చిన ఇర్లపాడులో నూతన గృహాల నిర్మాణాలకు విద్యుత్ సప్లయ్ ఇవ్వాలని సర్పంచ్ ముద్దా బాబు అడిగారు. అలాగే ఇరిగేషన్ చెరువులు మరమ్మత్తులు చేపట్టాలని, చేపల చెరువుల్లో చేపల పట్టకంలో నిబంధనలు పాటించాలని, వివిధ శాఖల పనితీరు పై సభ్యులు ప్రశ్నలు సంధించారు. జమ్ములక మడక గ్రామానికి ఆర్టీసీ బస్సును ఎందుకు ఆపారని.. బస్సు ఆపడంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని మడతల కస్తూరిరెడ్డి ఆర్టీసీ అధికారులను ప్రశ్నించారు. తక్షణం బస్సును ఏర్పాటు చేయాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని తెలిపారు. తహసీల్దార్ ఏవీ రవిశంకర్ మాట్లాడుతూ నూతన కార్డుల కోసం నెలాఖరు వరకు అవకాశం ఉందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెవెన్యూలోని రేషన్ కార్డుల ఏడు సర్వీసుల కోసం సచివాలయాల్లో అర్హతగల కార్డు దారులు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఎంపీడీఓ ప్రభాకర్ శర్మ మాట్లాడుతూ పథకాలను అర్హత కల్గిన వారంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎంపీడీఓకు సన్మానం

అనంతరం నూతనంగా ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన ప్రభాకర్ శర్మను వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందచేయాలి

ప్రాదేశిక సభ్యులు, సర్పంచ్‌లు అందరం కలిసి సమిష్టిగా మండల అభివృద్ధికి కృషి చేద్దామని తెలిపారు. అధికారులు బాధ్యతాయుతంగా పని చేసి.. ప్రభుత్వ పథకాలను అర్హత కల్గిన వారందరికీ అందచేయాలన్నారు. కందుల కొనుగోలు ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని సూచించారు. ఈకేవైసీపై రైతులుకు అవగాహన లేక చాల మంది రైతుల పంట ఇళ్లల్లోనే ఉందని.. వారికి తగు న్యాయం జరిగే విధంగా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కోటమ్మ, దేవసాయం, నిర్మలా, హజరత్తమ్మ, సీడీపీఓ సరోజని, ఎంఈఓ యువీ నారాయణరెడ్డి, భాస్కర్ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన దద్దాల



కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి గురించి జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. దద్దాలతో పాటు పార్టీ వలంటరీ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కే నాయబ్ రసూల్, డాక్టర్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు వాకుమళ్ల రాజశేఖర రెడ్డి, శివారెడ్డి తదితరులు ఉన్నారు.

కొండారెడ్డికి మాజీ మంత్రి సురేష్ నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సురేష్

పొన్నలూరు: మండలంలోని చెరువుకొమ్ముపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు జడ్డు కృష్ణారెడ్డి తండ్రి కొండారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. దీంతో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గురువారం ఇంటికి వెళ్లి కొండారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జేసీఎస్ మాజీ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు చిలుకల కొండారెడ్డి, పోలక వెంకటరెడ్డి, భూమిరెడ్డి వాసుదేవ రెడ్డి, ముత్తంగి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలు జయప్రదం చేయండి



జిల్లా మహాసభల ప్రచార పత్రాన్ని ప్రదర్శిస్తున్న సీపీఐ నేతలు

సీఎస్‌పురం(పామూరు): దర్శిలో 21వ తేదీ నుంచి 3 రోజుల పాటు జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి ఎస్‌కే.వై.పెదమస్తాన్ అన్నారు. సీఎస్‌పురం, ఎస్టీ కాలనీల్లో గురువారం సీపీఐ జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మహాసభలను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ విధిగా తరలిరావాలన్నారు. ఆగష్టు 23 నుంచి 25వ తేదీ వరకు రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరుగుతాయన్నారు.

పామూరు: దర్శిలో ఈ నెల 21 నుంచి జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ పిలుపునిచ్చారు. స్థానిక గుజ్జుల యల్లమందారెడ్డి భవన్‌లో గురువారం సీపీఐ జిల్లా మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడ్డ ప్రకాశం జిల్లాకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని, నిమ్జ్‌కు నిధులు కేటాయించాలన్నారు. జిల్లా మహాసభలను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరు విధిగా తరలిరావాలన్నారు. వజ్రాల సుబ్బారావు, రాగిపాటి సూరిబాబు, ప్రసాద్, మహేష్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్

పామూరు: మండల కేంద్రంలో రోడ్డు ఆక్రమణలు తొలగించిన ప్రాంతంలో తక్షణం రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ప్రభాకర్ మాట్లాడుతూ తొలగించిన ఆక్రమణల ప్రాంతంలో ఉన్న సైడు కాల్వలో పూడికతీత పనులు ప్రారంభించి వేగంగా పూర్తిచేయాలన్నారు. కనిగిరిరోడ్డు, సీఎస్‌పురంరోడ్డు, నెల్లూరురోడ్డు, కందుకూరు రోడ్డులలో తొలగించిన ఆక్రమణలు, పగులగొట్టి కాల్వలతో నిత్యం దుమ్ము ధూళితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆక్రమణల తొలగింపుతో వీధిన పడుతున్న చిరువ్యాపారులకు బతుకుదెరువు నిమిత్తం ప్రత్యామ్నాయం చూపాలన్నారు. సమావేశంలో ప్రసాద్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

185 పొగాకు బేళ్ల తిరస్కరణ



టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు



కొండెపిలో వేలంలో పాల్గొన్న వ్యాపారులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో గురువారం జరిగిన వేలంలో 850 పొగాకు బేళ్లను వ్యాపారులు కొనుగోలుచేశారు. ఆలకూరపాడు, రావివారిపాలెం, పాలేటిపాడు, జయవరం, అనంతవరం గ్రామాలకు చెందిన రైతులు 1035 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 850 బేళ్లను కొనుగోలు చేసి 185 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.180, సరాసరి ధర రూ.247.20 పలికింది. వేలంలో 22 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో 103 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి జి. సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కట్టవారిపాలెం, నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు 635 బేళ్లు వేలానికి తీసుకురాగా 532 బేళ్లను కొనుగోలు చేసి 103 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.180, సరాసరి ధర రూ.254.46గా నమోదైంది. వేలంలో 19 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు నాటుకోవాలి



కాకుటూరివారిపాలెంలో భూసార పరీక్ష పత్రాలు అందిస్తున్న ఏఓ యుగంధరరెడ్డి

టంగుటూరు: పొగాకు రైతులు తప్పనిసరిగా పచ్చి రొట్ట విత్తనాలు నాటి కలియదున్నాలని వ్యవసాయాధికారి యుగంధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని జమ్ములపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు విత్తుకోవడం వల్ల భూమిలో కర్బనశాతం పెరిగి ప్రధాన పైరుకు నాణ్యమైన దిగుబడులు వస్తాయని, రైతులు భూసార పరీక్ష ఫలితాలను అనుసరించి మాత్రమే ఎరువులు ఉపయోగించాలన్నారు. పశువైద్యాధికారి సోమశేఖర్ పశువుల బీమా గురించి వివరించారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): మట్టి పరీక్షలు రైతులకు ఎంతో ఉపయోగమని ఏఓ కాశీవిశ్వనాథ్ అన్నారు. మండలంలోని వావిలేటిపాడు, చింతలపాలెం రైతు సేవా కేంద్రంలో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోందిలో ఆయన పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయలు పండించాలని సూచించారు. రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు అందజేశారు.

పొన్నలూరు: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలని ఏఓ రాము అన్నారు. మండలంలోని విప్పగుంటలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వ్యవసాయ సహాయకులు శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

200 రోజులు పని కల్పించాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కేజీ మస్తాన్

కొండపి: ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 200 రోజుల పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కేజీ మస్తాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మూగచింతల, నెన్నూరుపాడు గ్రామాల్లో గురువారం ఉపాధి పనుల ప్రాంతానికి వెళ్లి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలి బకాయిలు వెంటనే విడుదల చయాలన్నారు. కూలీలకు వేతనాలు 15 రోజుల్లో ఇవ్వాల్సి ఉండగా మూడు నెలలుగా ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి కూలీలు ఐక్యంగా పథకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కె.బ్రహ్మయ్య, టి. బ్రహ్మయ్య, టి.గోవిందు, టి. అంకమ్మ తదిరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందజేయాలి



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ రవికుమార్

లింగసముద్రం: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందజేయాలని మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి బి.రవికుమార్ చెప్పారు. గురువారం మండలంలోని చినపవని, పెదపవని గ్రామాల్లో ఉన్న ఫెర్టిలైజర్స్ షాపులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాకు రిజిస్టర్లను, దుకాణాల్లో నిల్వ ఉన్న ఎరువులు, పురుగు మందులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలని, నిబంధనలు అతిక్రమించి షాపులు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారికి సలహాలు, సూచనలు అందించనున్నట్లు చెప్పారు.

సమాజ చైతన్యంలో జేవీవీ పాత్ర కీలకం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు

కనిగిరిరూరల్: సమాజ చైతన్యంలో జన విజ్ఞాన వేదిక పాత్ర కీలకమైందని ప్రభుత్వ ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ వెంకట సుబ్బయ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో జేవీవీ జిల్లా మహాసభల వాల్‌పోస్టర్‌లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీ మెడికల్ కౌన్సిల్ మాజీ సభ్యులు, వైద్యులు పెరుగు మురళీ కృష్ణా మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక 37 ఏళ్లుగా విద్య, వైద్య, విజ్ఞాన రంగాల్లో అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. సైన్స్ పరిజ్ఞానాన్ని సమాజంలో మరింత విస్తృతంగా పెంపొందిస్తున్న జేవీవీ కార్యకర్తల కృషిని కొనియడారు. జేవీవీ జాతీయ ఉపాధ్యక్షులు ఎస్‌కే గయాజ్ బాషా, వైద్యులు తిరుపతిరెడ్డి, ఆయేషా, కేటీసీ పాపారాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత



విద్యాసామగ్రి అందజేస్తున్న హెచ్‌ఎం, దాత

సీఎస్‌పురం(పామూరు): దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం బి.విజయకృష్ణకుమారి అన్నారు. మండలంలోని కోవిలంపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఆర్‌కే.వలి తన సొంత నిధులతో సమకూర్చిన నోట్‌బుక్స్, పెన్నులు, స్టడీ మెటీరియల్‌ను దాత హెచ్‌ఎంతో కలిసి విద్యార్థులకు అందజేశారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ దాతలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సాయంగా నిలవడం కొనియాడదగినదన్నారు. ఉపసర్పంచ్ టి.బాబూరావు, ఆర్‌ఎంపీ డోలా శేషు, పీఎంసీ చైర్మన్ సీహెచ్.చినకాశయ్య, డోలా తిరుపతయ్య, షాలిమ్, డి.నారాయణ, మహబూబ్‌బాషా, దాసు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేతనాలు ఆలస్యం కాకుండా చూడాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాయబ్‌రసూల్

సీఎస్‌పురం(పామూరు): బదిలీ పొందిన ఉపాధ్యాయుల వేతనాలు ఆలస్యం కాకుండా త్వరితగతిన ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్.నాయబ్‌రసూల్ అన్నారు. స్థానిక మెయిన్‌స్కూల్‌లో గురువారం ఏపీటీఎఫ్ సమావేశం సంఘం మండల అధ్యక్షుడు తోట శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయబ్‌రసూల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటుచేసిన 9 రకాల పాఠశాలల విధానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. నూతన పీఆర్‌సీ, 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్‌చేశారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జె.ఎస్.ఆనంద్‌బాబు మాట్లాడుతూ పాఠశాలల్లో తెలుగుమీడియం కొనసాగించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఏపీటీఎఫ్‌శాఖ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

కనిగిరిరూరల్: శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని శివనగర్ కాలనీలో గురువారం చైర్మన్ గఫార్, అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికులు రోడ్లు, మురికినీటి కాలువలు, విద్యుత్, తదితర మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని చైర్మన్‌కు విన్నవించారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.